
సాక్షి
గుంటూరు
మంగళవారం । 11 । ఫిబ్రవరి । 2025



కలెక్టర్‌ను కలసిన పరిశీలకురాలు

లక్ష్మీపురం: ఉమ్మడి కృష్ణా, గుంటూరు పట్టభద్రుల శాసనమండలి నియోజకవర్గ ఎన్నికల పరిశీలకురాలు వి.కరుణ సోమవారం జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మిని కలిశారు.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం సోమవారం 544.10 అడుగుల వద్ద ఉంది. జలాశయం నుంచి కుడికాలువకు 10,040 క్యూసెక్కులు విడుదలవుతోంది.



ముగిసిన బ్రహ్మోత్సవాలు

నగరంపాలెం: అరండల్‌పేటలోని శ్రీహంపి పీఠపాలిత శ్రీగంగామీనాక్షి సోమసుందరేశ్వరాలయం వార్షిక బ్రహ్మోత్సవాలు సోమవారం ముగిశాయి. హోమం నిర్వహించారు.

న్యూస్‌రీల్

ఘనంగా శ్రీ నిత్యానంద అవతరణ




తాడేపల్లిరూరల్: తాడేపల్లి రూరల్ పరిధిలోని కొలనుకొండ వద్ద వున్న హరేకృష్ణ గోకుల క్షేత్రంలో సోమవారం శ్రీ నిత్యానంద (బలరామ) అవతరణ కార్యక్రమాలను అంగరంగ వైభవంగా నిర్వహించారు. హరినామ సంకీర్తనల మధ్య శ్రీశ్రీ నితాయి గౌరంగ పంచామృతాలతో పంచ ద్రవ్యాలతో ఏకాదశ ఫలరశాలతో, 108 కలశాలతో పలు రకాల పుష్పాలతో శ్రీకృష్ణ బలరాములకు అభిషేకం నిర్వహించారు. అనంతరం ద్వాదశ హారతులు ఇచ్చారు. హరేకృష్ణ గోకుల క్షేత్ర అధ్యక్షుడు వంశీధర దాస మాట్లాడుతూ హరినామ సంకీర్తనతో మాత్రమే లోకానికి శుభం జరుగుతుందని అన్నారు. శ్రీకృష్ణ బలరాములే స్వయంగా శ్రీశ్రీ నితాయి గౌరంగ రూపంలో భూమి మీద అవతరించి అందరికీ తెలియజేశారని చెప్పారు.

93,597 బస్తాల మిర్చి విక్రయం



కొరిటిపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు సోమవారం 84,278 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ–నామ్ విధానం ద్వారా 93,597 బస్తాలు అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్–5, 273, 341, 4884, సూపర్–10 రకాల సగటు ధర రూ.9,000 నుంచి రూ.14,700 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల సగటు ధర రూ.10,000 నుంచి రూ.14,500 వరకు ధర లభించింది. ఏసీ కామన్ రకం రూ.9,500 నుంచి రూ.11,000 వరకు ధర పలికింది. ఏసీ ప్రత్యేక రకాలకు రూ.10,000 నుంచి రూ.14,000 వరకు ధర లభించింది. తాలు రకం మిర్చికి రూ.4,000 నుంచి రూ.7,500 వరకు ధర పలికింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 65,583 బస్తాలు నిల్వ ఉన్నట్లు యార్డు ఉన్నతశ్రేణి కార్యదర్శి ఎ.చంద్రిక తెలిపారు.

సాగునీటి సమాచారం



తాడేపల్లిరూరల్ (దుగ్గిరాల): కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు సీతానగరం వద్ద సోమవారం 1818 క్యూసెక్కులు విడుదల చేశారు. హై లెవల్ కాలువకు 0 క్యూసెక్కులు, బ్యాంక్ కెనాల్‌కు 156 క్యూసెక్కులు, తూర్పు కెనాల్‌కు 170 క్యూసెక్కులు, పశ్చిమ కెనాల్‌కు 125 క్యూసెక్కులు, నిజాంపట్నం కాలువకు 80 క్యూసెక్కులు, కొమ్మమూరు కాలువకు 900 క్యూసెక్కులు విడుదల చేశారు.

128 కేంద్రాల్లో టెన్త్ పరీక్షలు



నరసరావుపేట: జిల్లాలో మార్చి 17 నుంచి ప్రారంభం కానున్న పదో తరగతి పరీక్షలు 128 కేంద్రాల్లో నిర్వహించానున్నామని జిల్లా రెవెన్యూ అధికారి ఎ.మురళి వెల్లడించారు. సోమవారం కలెక్టరేట్‌లో పరీక్షల నిర్వహణపై సమీక్ష నిర్వహించారు. రెగ్యులర్, ఓపెన్ స్కూల్ విధానంలో కలిపి మొత్తం 26,597 మంది పరీక్షలు రాయనున్నారని తెలిపారు. వీరిలో ఓపెన్‌స్కూల్ విధానంలో 1,200 మంది రాయనున్నార్నారు. జిల్లాలోని అన్ని పరీక్షా కేంద్రాలు, స్పాట్ వాల్యుయేషన్ కేంద్రంలో మంచి నీటి సరఫరా, పారిశుద్ధ్య నిర్వహణ బాధ్యతలను నరసరావుపేట మున్సిపల్ కమిషనర్ జస్వంత్‌రావుకు అప్పగించారు. ప్రతి పరీక్షా కేంద్రం వద్ద ఒక హెల్త్ అసిస్టెంట్‌ను అందుబాటులో ఉంచాలని, అత్యవసర పరిస్థితుల్లో వెంటనే ఏ పరీక్షా కేంద్రానికి అయినా చేరుకునే విధంగా కీలక ప్రాంతాల్లో మెడికల్ వ్యాన్లను సిద్ధంగా ఉంచాలని డీఎంహెచ్‌వో డాక్టర్ బి.రవిని ఆదేశించారు.

ఆ గంట.. కీలకమంట!



- సైబర్ క్రైం జరిగినప్పుడు గోల్డెన్ అవర్ అత్యంత కీలకమంటున్న నిపుణులు
- ఆ సమయంలో ఫిర్యాదు చేస్తే త్వరగా రికవరీ జరిగే ఛాన్స్
- సైబర్ నేరగాళ్లను పట్టుకునేందుకూ వీలు
- ఆలస్యం చేస్తే ఇతర రాష్ట్రాలకు, క్రిప్టో కరెన్సీగా మారే అవకాశం



పట్నంబజారు: అత్యవసర పరిస్థితుల్లో ఎంతో అవసరమైన సమయంలో మనం వాడే పదం గోల్డెన్ అవర్. ఇప్పటివరకు రోడ్డు ప్రమాదాలు సంభవించేటప్పుడు మాత్రమే ఈ పదం విని ఉంటారు. ప్రమాదాలు సంభవించిన గంటలోపే క్షతగాత్రులను ఆస్పత్రికి చేర్చడం దీని ఉద్దేశం. ఇదే తరహాలో సైబర్ మోసాలకు గురయ్యే బాధితులు సైతం నేరం జరిగిన గంటలోగా ఫిర్యాదు చేయగలిగితే.. ఖాతాలో పోగొట్టుకున్న సొమ్మును తిరిగి రాబట్టుకునే వీలుంటుంది. బాధితులు చేయాల్సిందల్లా గోల్డెన్ అవర్లో సైబర్ సెల్‌కు ఫిర్యాదు చేయటమే. జిల్లాలో ఇప్పటివరకు వందల సంఖ్యలో సైబర్ నేరాలు నమోదు అయ్యాయని పోలీసు వర్గాలు చెబుతున్నాయి. తాము మోసానికి గురయ్యామని ఎన్‌సీఆర్‌బీకి ఫిర్యాదు చేయటం ద్వారా, లేదా 1930 సైబర్ సెల్ నంబరు డయల్ చేసి ఫిర్యాదు ఇవ్వడం వలన ఇప్పటివరకు రాష్ట్రవ్యాప్తంగా కోట్లాది రూపాయలు వెనక్కి తీసుకువచ్చినట్లు అధికారులు చెబుతున్నారు.

వెంటనే ఫిర్యాదు చేయండి..



సైబర్ మోసానికి గురయ్యేవారు వెంటనే గుర్తించాలి. తక్షణం ఫిర్యాదు చేస్తే మన డబ్బులు వెనక్కి వచ్చే అవకాశాలెక్కువ. లేదంటే ఎక్కడ ఉంటారో.. వారి ఖాతాలు ఏ రాష్ట్రానికి చెందినవో.. ఇవన్నీ కనుక్కోవడం పెద్ద ప్రక్రియ అవుతుంది. డయల్ 1930కు గానీ, ఎన్‌సీఆర్‌బీ గానీ ఫిర్యాదు చేసి బ్యాంకు వాళ్లను, దగ్గరలో ఉన్న పోలీస్‌స్టేషన్‌ను సంప్రదించాలి. తద్వారా బాధితుడికి న్యాయం చేసే అవకాశం ఉంటుంది.

– ఎస్.సతీష్‌కుమార్, ఎస్పీ, గుంటూరు జిల్లా

ఫిర్యాదు చేయాలిలా..



- మోసపోయామని తెలుసుకున్న వెంటనే బాధితులు 1930 నంబర్‌కు కాల్ చేయాలి.
- లేదంటే https://cybercrime. gov. in అనే పోర్టల్‌పై క్లిక్ చేయాలి. హోం పేజీలోకి వెళ్లి ఫైల్ ఎ కంప్లైంట్ ఆప్షన్‌పై క్లిక్ చేస్తే అక్కడ కొన్ని నియమాలు, షరతులు చూపిస్తుంది. వాటిని చదివి యాక్సెప్ట్ చేసి రిపోర్ట్ అదర్ సైబర్ క్రైమ్ బటన్‌పై క్లిక్ చేయాలి. తర్వాత సిటిజన్ లాగిన్ ఆప్షన్ సెలెక్ట్ చేసి పేరు, ఫోన్ నంబర్, ఈ–మెయిల్ వంటి వివరాలు ఎంటర్ చేస్తే రిజిస్టర్ మొబైల్ నెంబర్‌కు ఓటీపీ వస్తుంది. ఓటీపీ ఎంటర్ చేసి క్యాప్చా కోడ్‌ను బాక్స్‌లో ఫిల్ చేసి సబ్మిట్ బటన్ నొక్కాలి. తర్వాత పేజీలోకి తీసుకెళ్తుంది. అసలు ప్రక్రియ మొదలయ్యేది ఇక్కడే.
- ఈ పేజీలో ఒక ఫామ్ కనిపిస్తుంది.. దానిలో జరిగిన సైబర్ మోసం గురించి క్లుప్తంగా రాయాలి. అక్కడ నాలుగు సెక్షన్లుగా విభజించి ఉంటుంది. సాధారణ సమాచారం (విక్టిమ్ ఇన్ఫర్మేషన్), సైబర్ నేరానికి సంబంధించి సమాచారం (సైబర్ క్రైమ్ ఇన్ఫర్మేషన్), ప్రివ్యూ అనే సెక్షన్‌లు ఉంటాయి. ప్రతి సెక్షన్‌లో అడిగిన వివరాలను సమర్పిస్తూ.. ప్రక్రియను పూర్తిచేయాలి. మూడు సెక్షన్లు పూర్తయ్యాక ప్రివ్యూను వెరిఫై చేయాలి. అన్ని వివరాలు సరిగా ఉన్నాయని భావిస్తే సబ్మిట్ బటన్ క్లిక్ చేయాలి. తర్వాత ఘటన ఎలా జరిగిందనేది వివరాలు నమోదుచేయాలి. నేరానికి సంబంధించిన స్క్రీన్ షాట్లు (అకౌంట్ ట్రాన్సాక్షన్ తదితర) ఫైల్స్ వంటి ఆధారాలు, సాక్ష్యాలు అందులో పొందుపర్చాలి. వివరాలు సేవ్ చేసి నేరగాళ్ల గురించి ఏదైనా సమాచారం తెలిస్తే ఫిల్ చేయాలి.
- అంతా వెరిఫై చేసుకున్నాక సబ్మిట్ బటన్ క్లిక్ చేస్తే కన్ఫర్మేషన్ మెసేజ్ వస్తుంది. కంప్లైంట్ ఐడీతో పాటు ఇతర వివరాలతో కూడిన ఈ–మెయిల్ వస్తుంది. తర్వాత అధికారులు దర్యాప్తు ప్రారంభిస్తారు. ఫిర్యాదు చేయడం ఆలస్యమైతే దుండగుడు డబ్బును వేర్వేరు ఖాతాల్లో మళ్లించేస్తాడు. లేదంటే క్రిప్టో కరెన్సీగా మార్చుకునే ప్రమాదముంది. సైబర్ మోసానికి గురైతే 1930 నంబర్‌కు కాల్ చేయాలి.



మదిమదిలో మరియమాత

- రెండో రోజు కొనసాగిన మేరీమాత తిరునాళ్ల
- సమష్టి దివ్యబలిపూజ సమర్పించిన ఖమ్మం కథోలిక పీఠాధిపతి ప్రకాష్
- ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు

గుణదల(విజయవాడ తూర్పు): నూరు వసంతాలుగా గుణదల మేరీమాత పుణ్యక్షేత్రం భక్తి విశ్వాసాలకు కేంద్రంగా, పవిత్ర ఆధ్యాత్మిక క్షేత్రంగా విరాజిల్లుతోందని ఖమ్మం కథోలిక పీఠాధిపతి సగిలి ప్రకాష్ అన్నారు. గుణదల మేరీమాత పుణ్యక్షేత్రంలో జరుగుతున్న ఉత్సవాల రెండో రోజు కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా భక్తులనుద్దేశించి ఆయన మాట్లాడుతూ దైవ కుమారుడైన ఏసుక్రీస్తు ద్వారా ఈ లోకానికి రక్షణ చేకూరిందని తెలిపారు. మానవాళి రక్షణ ప్రణాళికలో భాగంగా మరియ గర్భవాసాన లోక రక్షకుడు జన్మించారని గుర్తు చేశారు. మరియ తల్లి పవిత్రతను బట్టి దేవుడు ఆమెను తన తల్లిగా ఎన్నుకున్నారన్నారు. మరియతల్లి లోకమాతగా కీర్తి నొందుతోందని పేర్కొన్నారు.

ఆలోచింపజేసిన నాటకాలు..

గుణదల మేరీమాత పుణ్యక్షేత్రంలో సమష్టి దివ్య బలి పూజ అనంతరం ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు యాత్రికులను విశేషంగా ఆకట్టుకున్నాయి. భక్తులలో విశ్వాసం పెంపొందించే దిశగా బైబిల్ చరిత్రలోని అంశాలను కళాకారులు నాటికలుగా, ఏక పాత్రాభినయంగా ప్రదర్శించారు. ఏసుకృప నాటకం ప్రధానాకర్షణగా నిలిచింది. విద్యార్థులు నిర్వహించిన కోలాటం చూపరులను ఆకట్టుకుంది.

మరియతల్లి దీవెనలతో..



అనంతరం విజయవాడ బిషప్ తెలగతోటి రాజారావు మాట్లాడుతూ, మరియతల్లిపై భక్తులకు అమితమైన విశ్వాసం ఉండబట్టే మేరీమాత పుణ్యక్షేత్రం ఆధ్యాత్మిక శోభను సంతరించుకుందని తెలిపారు. ఉత్సవాలు సమర్థంగా జరుగుతున్నాయంటే మరియతల్లి దీవెనలే కారణమని వివరించారు. మరియమ్మను ఆశ్రయించి భక్తులందరూ దీవెనలు పొందాలని కాంక్షించారు. అనంతరం సమష్టి దివ్యబలి పూజ సమర్పించి భక్తులకు సత్ప్రసాదాన్ని అందజేశారు. కార్యక్రమంలో పుణ్యక్షేత్ర రెక్టర్ ఫాదర్ ఏలేటి విలియం జయరాజు, వికార్ జనరల్ ఫాదర్ గాబ్రియేలు, మోన్సిగ్నోర్ ఫాదర్ మువ్వల ప్రసాద్, పలు విచారణల గురువులు పాల్గొన్నారు.

ముగిసిన నామినేషన్ల పర్వం

- మొత్తం 40 మంది 69 నామినేషన్లు..
- చివరిరోజు నామినేషన్లు వేసిన 22 మంది అభ్యర్థులు

సాక్షి ప్రతినిధి, గుంటూరు: ఆంధ్రప్రదేశ్ శాసన మండలిలోని కృష్ణా – గుంటూరు పట్టభద్రుల నియోజకవర్గానికి సంబంధించి నామినేషన్ల స్వీకరణ గడువు సోమవారం మధ్యాహ్నం మూడు గంటలకు ముగిసింది. చివరిరోజున పెద్ద ఎత్తున నామినేషన్లు దాఖలయ్యాయి. సోమవారం ఒక్కరోజే 22 మంది అభ్యర్థులు 43 సెట్ల నామినేషన్లు దాఖలు చేశారు. నామినేషన్ల ఘట్టం ముగిసే సమయానికి 40 మంది అభ్యర్థులు 69 సెట్ల నామినేషన్లు దాఖలు చేశారు. నామినేషన్ల పరిశీలన మంగళవారం ఉదయం 11 గంటలకు చేపడతారు. ఈ నెల 27న ఎన్నిక జరగనుంది. ప్రధానంగా పోటీ ప్రస్తుత ఎమ్మెల్సీగా ఉన్న కె.ఎస్.లక్ష్మణరావు, తెలుగుదేశం అభ్యర్థి ఆలపాటి రాజా మధ్య జరగనుంది. అన్ని రంగాల నుంచి పలువురు పోటీలో నిలబడ్డారు. కె.ఎస్. లక్ష్మణరావు ప్రోగ్రెసివ్ డెమోక్రటిక్ ఫ్రంట్ అభ్యర్థిగా రంగంలోకి దిగుతున్నారు. ఆయనకు వామపక్షాలు, విద్యార్థి, యువజన, ప్రజా సంఘాలు మద్దతు ప్రకటించాయి. కాంగ్రెస్ పార్టీ తరఫున మాజీ ఎమ్మెల్యే మస్తాన్‌వలీ మద్దతు ప్రకటించారు. మరోవైపు జనసేన పార్టీకి చెందిన ఆయన పూర్వ విద్యార్థులు కూడా వచ్చి సంఘీభావం ప్రకటించి, సన్మానించడం జిల్లాలో చర్చనీయాంశంగా మారింది. వలంటీర్లను కూటమి ప్రభుత్వం మోసం చేసిన నేపథ్యంలో కృష్ణా జిల్లా నుంచి వలంటీరు ఒకరు బరిలో నిలబడ్డారు.

వలంటీర్ల సత్తా చూపిస్తాం

- వలంటీర్లకు జరిగిన అన్యాయంపై చట్టసభల్లో ప్రశ్నిస్తాం
- పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేసిన వలంటీర్ గంటా మమత



మాట్లాడుతున్న వలంటీర్ గంటా మమత, చిత్రంలో గుంటూరు, కృష్ణా జిల్లాల వలంటీర్ల సంఘం నాయకులు

లక్ష్మీపురం(గుంటూరు వెస్ట్): పట్టభద్రుల శాసన మండలి ఎన్నికల్లో రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వానికి వలంటీర్ల సత్తా చూపిస్తామని, వలంటీర్లకు జరిగిన అన్యాయంపై చట్టసభల్లోనే ప్రశ్నిస్తానని విజయవాడకు చెందిన వలంటీర్ గంటా మమత అన్నారు. సోమవారం ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గం నుంచి ఎమ్మెల్సీ అభ్యర్థిగా గంటా మమత నామినేషన్ దాఖలు చేశారు. ఆమె తన నామినేషన్ పత్రాలను గుంటూరు జిల్లా కలెక్టర్ నాగలక్ష్మికి అందజేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ఎన్నికల సమయంలో కూటమి నాయకులు, వలంటీర్లకు న్యాయం చేస్తామని చేసిన వాగ్దానాన్ని మర్చిపోయారని అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 2,60,000 మంది వలంటీర్ల జీవితాలను కూటమి ప్రభుత్వం చిన్నాభిన్నం చేసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. పలు సందర్భాల్లో కూటమి ప్రభుత్వ నాయకులను వలంటీర్ల సమస్యల గురించి అడిగితే ఏదో ఒక సాకు చెబుతూ కాలయాపన చేస్తూ వచ్చారని అన్నారు. అందుకే వలంటీర్లందరూ ఐకమత్యంతో ఉమ్మడి గుంటూరు, కృష్ణాజిల్లాల పట్టభద్రుల ఎన్నికలలో తనకు ప్రథమ ప్రాధాన్యత ఓటు వేసి కూటమి ప్రభుత్వానికి గుణపాఠం చెప్పాలన్నారు. వలంటీర్లు, ఉమ్మడి గుంటూరు కృష్ణా జిల్లాల్లోని గ్రాడ్యుయేట్స్ అందరూ మాకు అండగా ఉన్నారని తెలిపారు. పట్టభద్రుల ఎన్నికల్లో వలంటీర్ల సత్తా ప్రభుత్వానికి చూపిస్తామన్నారు.

ఒత్తిడి దూరం చేసేందుకే పరీక్షా పే చర్చ

జిల్లా విద్యాశాఖాధికారి సీవీ రేణుక



పరీక్షా పే చర్చ కార్యక్రమాన్ని తిలకిస్తున్న డీఈఓ

గుంటూరు ఎడ్యుకేషన్: పరీక్షల సమయంలో విద్యార్థుల్లో భయం, ఒత్తిడిని దూరం చేసేందుకే ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ప్రతి యేటా పరీక్షా పే చర్చ కార్యక్రమం నిర్వహిస్తున్నారని డీఈఓ సీవీ రేణుక పేర్కొన్నారు. సోమవారం పాత బస్టాండ్ సెంటర్‌లోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో విద్యార్థులు, ఉపాధ్యాయులతో కలిసి పరీక్షా పే చర్చ ప్రసారాన్ని తిలకించారు. అనంతరం మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పరీక్షా పే చర్చ కార్యక్రమాన్ని జిల్లాలో అన్ని యాజమాన్యాల్లోని పాఠశాలల విద్యార్థులు ప్రత్యక్షంగా తిలకించేందుకు ఏర్పాట్లు చేయించామని, పీఎం మోదీ నేరుగా విద్యార్థులతో మాట్లాడే మంచి కార్యక్రమం అని అన్నారు. పబ్లిక్ పరీక్షలపై విద్యార్థుల్లో నెలకొన్న సందేహాలు, ఆందోళనలను దూరం చేసే విధంగా కార్యక్రమం ప్రయోజనం చేకూర్చుతుందన్నారు. ఉర్దూ డీఐ షేక్ ఎండీ ఖాసిం, డీసీఈబీ కార్యదర్శి ఎ.తిరుమలేష్, ఎంఈఓలు అబ్దుల్ ఖుద్దూస్, జ్యోతికిరణ్ పాల్గొన్నారు.

రాజకీయ నిరుద్యోగులకు మండలి వేదిక కావొద్దు

- కేఎస్ లక్ష్మణరావును గెలిపించుకోవాలి
- పీడీఎఫ్ ఎమ్మెల్సీలు ఐ.వెంకటేశ్వరరావు, బొర్రా గోపిమూర్తి
- గుంటూరులో నామినేషన్ వేసిన లక్ష్మణరావు



కేఎస్ లక్ష్మణరావు వెంట తరలివస్తున్న భారీ జనసందోహం

గుంటూరు ఎడ్యుకేషన్: శాసనమండలి రాజకీయ నిరుద్యోగులకు వేదిక కారాదని పీడీఎఫ్ ఎమ్మెల్సీ ఐ.వెంకటేశ్వరరావు అన్నారు. శాసనమండలి కృష్ణా – గుంటూరు పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ అభ్యర్థిగా పీడీఎఫ్ తరఫున కేఎస్ లక్ష్మణరావు సోమవారం నామినేషన్ వేశారు. గుంటూరు మార్కెట్ సెంటర్‌లోని శ్రీవేంకటేశ్వర విజ్ఞాన మందిరంలో సభ నిర్వహణ అనంతరం వందలాది మంది మద్దతుదారులతో కలిసి జిల్లా కలెక్టరేట్‌కు ర్యాలీగా తరలివెళ్లారు. ముందుగా యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు నక్కా వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగిన సభలో ఎమ్మెల్సీ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ప్రజా పోరాటాల ద్వారానే పాలకుల మైండ్‌సెట్ మార్చగలమన్నారు. అధికార పార్టీ నుంచి వచ్చిన వ్యక్తి ఎమ్మెల్సీగా మండలిలో అడుగుపెడితే ప్రజా సమస్యలను ప్రభుత్వాన్ని నిలదీయగలరా అని అన్నారు. మరో ఎమ్మెల్సీ బొర్రా గోపిమూర్తి మాట్లాడుతూ గ్రాడ్యుయేట్, టీచర్ ఎమ్మెల్సీ స్థానాలకు సైతం రాజకీయపార్టీలు అభ్యర్థులను పోటీకి దింపడం తగదని, ప్రజల తరఫున గళం విన్పించగలిగే సత్తా గల నేతలే మండలిలో అడుగుపెట్టాలన్నారు. కూటమి పాలనలో హామీలను విస్మరించి, సమస్యలు పట్టి పీడిస్తున్నాయని, ఎమ్మెల్సీ ఎన్నికల్లో పట్టభద్రులు సరైన తీర్పు ఇస్తారని అన్నారు.

ఉద్యమాలతో ప్రభుత్వాల మెడలు వంచుతాం..

మాజీ ఎమ్మెల్సీ వి.బాలసుబ్రహ్మణ్యం మాట్లాడుతూ ప్రజా ఉద్యమాలతోనే ప్రజా వ్యతిరేక ప్రభుత్వాల మెడలు వంచగలమన్నారు. ప్రజల నుంచి వచ్చిన పీడీఎఫ్ ఎమ్మెల్సీలుగా తాము సొంత ప్రయోజనాల కంటే ప్రజా ప్రయోజనాలకే అధిక ప్రాధాన్యమిచ్చామని, కేఎస్ లక్ష్మణరావును గెలిపించుకోవాల్సిన బాధ్యత గ్రాడ్యుయేట్ ఓటర్లపై ఉందన్నారు. కూటమి ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాల కారణంగా రానున్న కాలంలో 15,000 ప్రభుత్వ పాఠశాలలు మూతపడే అవకాశం ఉందన్నారు. 8 నెలల కాలంలోనే కూటమి ప్రభుత్వం తీవ్ర వ్యతిరేకతను ఎదుర్కొంటుందని తెలిపారు. యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు నక్కా వెంకటేశ్వర్లు మాట్లాడారు. అనంతరం పీడీఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి కేఎస్ లక్ష్మణరావు మాట్లాడుతూ పోటీలో తనకు ఎదురుగా ఎవరున్నా తాము భయపడే ప్రసక్తే లేదని అన్నారు. కృష్ణా–గుంటూరు జిల్లాల్లో ఉన్న 3.46 లక్షల గ్రాడ్యుయేట్ ఓటర్లు ఈనెల 27న జరిగే ఎన్నికల్లో చక్కటి తీర్పు ఇస్తారన్నారు. కాంగ్రెస్ పార్టీ మాజీ ఎమ్మెల్యే షేక్ మస్తాన్‌వలి, జనసేన నాయకుడు చందు కేఎస్ లక్ష్మణరావుకు మద్దతు తెలిపారు. అంగన్‌వాడీ, మెడికల్ రిప్రజెంటేటివ్స్, పాలిటెక్నిక్ కాంట్రాక్టు అధ్యాపకులు, సదరన్ ప్రైవేటు అధ్యాపక, ఉపాధ్యాయ సంఘం, ఆవాజ్ తదితర ప్రజా, ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక సంఘాల నాయకులు తమ మద్దతు ప్రకటించారు. సభ అనంతరం విజ్ఞాన మందిరం నుంచి భారీ ర్యాలీగా కలెక్టరేట్‌కు తరలివెళ్లారు. సభతో పాటు ర్యాలీలో రెండువేలకు పైగా ఆయా వర్గాల ప్రతినిధులు, గ్రాడ్యుయేట్లు పాల్గొన్నారు. మాజీ ఎమ్మెల్సీ బొడ్డు నాగేశ్వరరావు, ఆల్ ఇండియా లాయర్స్ అసోసియేషన్ నాయకుడు నర్రా శ్రీనివాసరావు, యూటీఎఫ్ రాష్ట్ర ప్రచురణల విభాగం చైర్మన్ ఎం.హనుమంతరావు, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు యు.రాజశేఖర్‌రావు, ఎం.కళాధర్, జనవిజ్ఞానవేదిక నాయకులు పాల్గొన్నారు.



నామినేషన్ పత్రాలు అందజేస్తున్న లక్ష్మణరావు, చిత్రంలో ఎమ్మెల్సీలు, మాజీ ఎమ్మెల్సీలు

నులిపురుగుల నివారణతో ఆరోగ్యం

వైద్య ఆరోగ్యశాఖ కమిషనర్ వీరపాండియన్



విద్యార్థులతో నులిపురుగుల నివారణ మాత్రలు మింగిస్తున్న కమిషనర్ వీరపాండియన్, చిత్రంలో డీఎంహెచ్‌ఓ డాక్టర్ విజయలక్ష్మి

గుంటూరు మెడికల్: కేవలం ఒకే ఒక్క మాత్రలో నులిపురుగులను నివారించవచ్చని రాష్ట్ర వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమశాఖ కమిషనర్ జి.వీరపాండియన్ అన్నారు. స్థానిక గుంటూరు పాత బస్టాండ్ సెంటర్‌లోని ప్రభుత్వ ఉర్దూ బాలుర ఉన్నత పాఠశాలలో సోమవారం జరిగిన జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేశారు. వీరపాండియన్ మాట్లాడుతూ చిన్నారుల్లో తలెత్తే ఆరోగ్య సమస్యలను నివారించేందుకు ప్రభుత్వం ఉచితంగా ఈ మాత్రలు పంపిణీ చేస్తుందన్నారు. ఏడాది నుంచి 19 ఏళ్లలోపు పిల్లలకు ఏకకాలంలో అందరికీ ఆల్బెండజోల్ మాత్రలు సోమవారం రాష్ట్రవ్యాప్తంగా మింగించడం జరిగిందన్నారు. ఆల్బెండజోల్ మాత్రలు తీసుకోకపోతే పిల్లల్లో రక్తహీనత, ఎదుగుదల లోపాలు వస్తాయని వెల్లడించారు. ఆర్బీఎస్‌కే స్టేట్ నోడల్ ఆఫీసర్ డాక్టర్ ప్రశాంత్ విద్యార్థులకు చేతుల శుభ్రతపై అవగాహన కల్పించారు. జేసీ భార్గవ్ తేజ్, డీఎంహెచ్‌ఓ డాక్టర్ కొర్రా విజయలక్ష్మి, డీఈఓ సీవీ రేణుక, ఎంఈఓ ఖుద్దుస్, పాఠశాల హెచ్‌ఎం వసుంధరా దేవి పాల్గొన్నారు.

వాణిజ్యం
నిమ్మకాయల ధరలు

గుంటూరు జిల్లా తెనాలి మార్కెట్‌యార్డులో సోమవారం నిమ్మకాయల క్వింటా ధర

కనిష్టం : రూ. **4,500** గరిష్టం : రూ. **5,500**

మోడల్ ధర రూ. **5,000**

అసంఘటిత కార్మికులకు అండగా ఈ–శ్రమ పథకం

- ప్రమాదం బారినపడితే రూ.2లక్షలు పరిహారం
- పూర్తి అంగవైకల్యం వాటిల్లితే రూ.2లక్షలు వర్తింపు
- కార్మికశాఖ సహాయ కమిషనర్ డి.వెంకట శివప్రసాద్



భవన నిర్మాణ కార్మికులకు అవగాహన కల్పిస్తున్న అసిస్టెంట్ కమిషనర్ వెంకట శివప్రసాద్

తెనాలిటౌన్: అసంఘటిత కార్మికులకు ఈ–శ్రమ పథకం అండగా ఉంటుందని కార్మికశాఖ సహాయ కమిషనర్ డి.వెంకట శివప్రసాద్ తెలియజేశారు. ఆయన మాట్లాడుతూ అసంఘటిత కార్మికుల శ్రేయస్సును దృష్టిలో ఉంచుకుని కేంద్రం 2021 ఆగస్టు నెలలో ఈ–శ్రమ పథకాన్ని ప్రారంభించినట్లు వెల్లడించారు. రూ.20 వేల కోట్ల నిధులను ఈ పథకానికి మంజూరు చేసినట్లు వివరించారు. రాష్ట్రంలో 81 లక్షల మంది ఈ–శ్రమ పథకంలో సభ్యులుగా చేరినట్లు స్పష్టం చేశారు. గుంటూరు జిల్లాలో 6,50,314 మంది ఈ–శ్రమ కార్డులు పొందినట్లు తెలిపారు. తెనాలి కార్మికశాఖ కార్యాలయ పరిధిలో తాడేపల్లి, మంగళగిరి, దుగ్గిరాల, చేబ్రోలు, కొల్లిపర, వట్టిచెరుకూరు, వేమూరు, కొల్లూరు, రేపల్లె, భట్టిప్రోలు, నగరం, చెరుకుపల్లి, కర్లపాలెం, బాపట్ల తదితర మండలాలు ఉన్నట్లు వివరించారు. తెనాలి కార్యాలయ పరిధిలోని ప్రతి మండలంలో పర్యటించి అసంఘటిత కార్మికులను కలిసి చైతన్యపరుస్తున్నట్లు వెల్లడించారు. ఈ–శ్రమ పథకం ఆపదలో ఉన్న కుటుంబానికి అండగా ఉంటుందని తెలియజెప్పుతున్నట్లు వివరించారు. 16 నుంచి 59 సంవత్సరాలు వయస్సు కలిగిన ప్రతి ఒక్కరూ ఈ కార్డు పొందేందుకు అర్హులుగా తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగులు కాని వారు, పీఎఫ్, ఈఎస్‌ఐ సభ్యులు కాని వారు ఈ పథకానికి అర్హులుగా తెలియజేశారు. ఆధార్ కార్డు, బ్యాంకు పాస్‌బుక్ తీసుకుని సీఎస్ సెంటర్, గ్రామ వార్డు సచివాలయాలకు వెళితే ఈ శ్రమ స్కీమ్‌లో చేరవచ్చని స్పష్టం చేశారు. ప్రమాదవశాత్తు ఏదైనా జరిగిన కూడా కార్మికులకు నెలలోగా రూ.2లక్షలు ప్రమాద బీమా, కుటుంబ సభ్యులకు అందుతుందని తెలిపారు. అదే విధంగా ప్రమాదంలో పూర్తి అంగవైకల్యం బారిన పడితే రూ.2లక్షలు, పాక్షిక అంగవైకల్యానికి రూ.లక్ష పరిహారంగా నామినీ ఖాతాకు జమ చేస్తారని స్పష్టం చేశారు. ఇప్పటి వరకు రాష్ట్రంలో సీఎస్ సెంటర్‌ల ద్వారా 4,53,867, సెల్ఫ్ రిజిస్ట్రేషన్ 1,96,337గా నమోదు అయినట్లు వెల్లడించారు. రాష్ట్రంలో ఈ పథకం కింద సభ్యులుగా చేర్పించడంలో ఈస్ట్ గోదావరి, అనంతపురం, వెస్ట్ గోదావరి, కృష్ణా, గుంటూరు జిల్లాలు 1,2,3,4 వరుస సంఖ్యలో ఉన్నట్లు వెల్లడించారు. కార్మికశాఖ ప్రస్తుతం ఈ పథకంపై స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు తెలియజేశారు. వివిధ రకాల యూనియన్‌లను కలిసి పథకం గురించి వివరించడం, సీఎస్ సెంటర్ల మొబలైజేషన్, స్వయం సహాయక సంఘాల ద్వారా విస్తృత అవగాహన చేపట్టినట్లు తెలిపారు. ఈ–శ్రమ కార్డు పొందేందుకు అవసరమైన డాక్యుమెంట్లు సమర్పించి కేవలం రూ.15లు చెల్లిస్తే కార్డు పొందవచ్చని స్పష్టం చేశారు. ప్రతి ఒక్కరూ ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఆర్‌వీఆర్‌జేసీ కళాశాలకు జాతీయస్థాయిలో ఏఏ రేటింగ్

రెండు ప్రత్యేక అవార్డులు సైతం..



అవార్డులను చూపుతున్న కళాశాల యాజమాన్య ప్రతినిధులు

గుంటూరు రూరల్: ఎన్‌పీటీఈఎల్ పరీక్షా ఫలితాల్లో విద్యార్థులు కనబరిచిన విశేష ప్రతిభకు 12వ సారి తమ కళాశాలకు జాతీయ స్థాయిలో ఏఏ రేటింగ్, రెండు ప్రత్యేక అవార్డులు రావడం సంతోషంగా ఉందని ఆర్‌వీఆర్‌జేసీ ఇంజినీరింగ్ కళాశాల అధ్యక్షుడు డాక్టర్ ఆర్.శ్రీనివాస్, ఉపాధ్యక్షులు జాగర్లమూడి మురళీమోహన్, డాక్టర్ జగదీష్ మద్దినేనిలు తెలిపారు. చౌడవరం గ్రామంలోని కళాశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ అవార్డులతోపాటుగా దేశంలోని అన్ని లోకల్ చాప్టర్స్‌లో తమ కళాశాల అగ్రస్థానంలో నిలవడం గర్వకారణంగా ఉందన్నారు. ఈ ప్రతిష్టాత్మక గుర్తింపులో భాగంగా, కళాశాల విద్యార్థులు 85 గోల్డ్, 1,012 ఎలైట్, 439 సిల్వర్ గ్రేడ్‌లను సాధించడంతోపాటు 62 మంది టాపర్ సర్టిఫికెట్లు పొందారన్నారు. ఇటీవల ఐఐటీ మద్రాస్‌లో నిర్వహించిన కార్యక్రమంలో కళాశాల ప్రతినిధులు ఈ అవార్డులను స్వీకరించారన్నారు. ఎన్‌పీటీఈఎల్ కోర్సులు ప్రపంచవ్యాప్తంగా సాంకేతిక పరిజ్ఞానాన్ని అందుకునేందుకు అనుకూలంగా ఉంటాయని కళాశాల సెక్రటరీ కరెస్పాండెంట్ ఆర్.గోపాలకృష్ణ, ట్రెజరర్ డాక్టర్ కె.కృష్ణప్రసాద్‌లు తెలిపారు. ఈ కోర్స్‌లలో టాపర్‌గా నిలిచిన విద్యార్థులకు ఇంటర్న్‌షిప్, ఉద్యోగ అవకాశాలు దక్కనున్నాయని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.శ్రీనివాస్ తెలిపారు. ఈ సందర్భంగా అవార్డులు, జాతీయ స్థాయిలో రేటింగ్‌ను పొందేందుకు కృషిచేసిన అధ్యాపకులు, విద్యార్థులను కళాశాల డైరెక్టర్ డాక్టర్ కె.రవీంద్ర, ఏట డైరెక్టర్ డాక్టర్ ఎన్వీ శ్రీనివాసరావు, ఎన్‌పీటీఈఎల్ లోకల్ చాప్టర్ సమన్వయకర్త, సీఎస్‌డీ విభాగాధిపతి డాక్టర్ ఎంవీపీ చంద్రశేఖర్ తదితరులు అభినందించారు.

విజ్ఞాన్ యూనివర్సిటీకి జాతీయ స్థాయిలో ఏఏ గ్రేడ్



టీం సభ్యులను అభినందిస్తున్న వర్సిటీ సీఈఓ డాక్టర్ మేఘన కూరపాటి, వీసీ పి.నాగభూషణ్

చేబ్రోలు: చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్సిటీకి ఐఐటీ మద్రాస్ విడుదల చేసిన జాతీయస్థాయి స్వయం ఎన్‌పీటీఈఎల్ ర్యాంకింగ్స్‌లో 'ఏఏ గ్రేడ్' లభించిందని వైస్ చాన్స్‌లర్ పి.నాగభూషణ్ సోమవారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ స్వయం ఎన్‌పీటీఈఎల్ విడుదల చేసిన ర్యాంకింగ్స్‌లో జాతీయస్థాయిలో 100లోపు ర్యాంక్ సాధించి 'ఏఏ గ్రేడ్'ను యూనివర్సిటీ సొంతం చేసుకుందన్నారు. ఎన్‌పీటీఈఎల్ నిర్వహించిన వివిధ రకాల కోర్సులలో తమ విద్యార్థులు పాల్గొని 2814 కోర్సు సర్టిఫికెట్లు సాధించారన్నారు. వీటిలో 51 మందికి టాపర్స్, 29 గోల్డ్, 271 సిల్వర్, 978 ఎలైట్, 1536 మంది సాధారణ ఉత్తీర్ణత సర్టిఫికెట్స్ సాధించారని వెల్లడించారు. 2024వ సంవత్సరంలో ఎన్‌పీటీఈఎల్ నిర్వహించిన వివిధ రకాల కోర్సులలో ఉత్తమ ప్రతిభకు గాను 'ఏఏ గ్రేడ్' లభించిందని వెల్లడించారు. విజ్ఞాన్స్ యూనివర్సిటీ వరుసగా 7వ సారి 100లోపు ర్యాంక్ సాధించిందన్నారు. 'ఏఏ గ్రేడ్' సాధించడానికి కృషి చేసిన టీం సభ్యులను విజ్ఞాన్ యూనివర్సిటీ సీఈఓ డాక్టర్ మేఘన కూరపాటి, వైస్ చాన్స్‌లర్ పి.నాగభూషణ్ తదితరులు అభినందించారు.

క్లుప్తంగా

రాష్ట్రస్థాయి చేతిరాత పరీక్షలో కంతేరు విద్యార్థిని ప్రతిభ



కంతేరు(తాడికొండ): రాష్ట్రస్థాయిలో నిర్వహించిన చేతిరాత పరీక్షలో తమ పాఠశాల విద్యార్థిని ఉత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయిలో ద్వితీయ ర్యాంకు సాధించిందని కంతేరు జడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం టి.పద్మావతి తెలిపారు. ఈ నెల 8వ తేదీన గుంటూరులోని హిందూ కళాశాలలో గుడ్ కాలీగ్రాఫర్స్ కుటుంబం ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి కాలీగ్రాఫ్ (చేతిరాత) పోటీలలో పాల్గొన్న తమ పాఠశాల 9వ తరగతి విద్యార్థిని ద్వితీయ బహుమతి పొందడం గర్వకారణమన్నారు. ఈ సందర్భంగా సోమవారం పాఠశాలలో నిర్వహించిన అభినందన సభలో పలువురు ఉపాధ్యాయులు, సొసైటీ మాజీ చైర్మన్ వాసిరెడ్డి జయరామయ్య తదితరులు విద్యార్థినిని అభినందించారు. విద్యార్థినికి గైడ్‌గా వ్యవహరించిన ఉపాధ్యాయుడు ఎ.వెంకటరెడ్డిని పలువురు కొనియాడారు. కార్యక్రమంలో విద్యాకమిటీ చైర్మన్ ఎ.విజయ్, పలువురు గ్రామస్తులు పాల్గొన్నారు.

బీసీ సంక్షేమ సంఘం యువజన అధ్యక్షుడిగా గంగరాజు

నిజాంపట్నం: బీసీ సంక్షేమ సంఘం బాపట్ల జిల్లా యువజన అధ్యక్షుడిగా నిజాంపట్నానికి చెందిన పచ్చపట్ల గంగరాజు నియమితులయ్యారు. ఈ మేరకు బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర యువజన అధ్యక్షుడు, జాతీయ ప్రధాన కార్యదర్శి కుమ్మరి క్రాంతి కుమార్, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర యువజన ప్రధాన కార్యదర్శి కొల్లూరి హనుమంతరావు సోమవారం ప్రకటించారు. ఆయన ప్రమాణ స్వీకారం ఈ నెల 13న నిజాంపట్నంలో జెడ్పీటీసీ సభ్యుడు నర్రా సుబ్బయ్య ఆధ్వర్యంలో జరుగుతుందని పేర్కొన్నారు. గంగరాజుకు పలువురు శుభాకాంక్షలు తెలిపారు.

ప్రభుత్వ విశ్రాంత డ్రైవర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా యండమూరి



యండమూరి నాగరాజు, శ్రీనివాసరావు, మొగిలి గురవయ్యలను సత్కరిస్తున్న దృశ్యం

కొరిటెపాడు(గుంటూరు): ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విశ్రాంత డ్రైవర్ల ఆత్మీయ సమావేశం గుంటూరులోని ప్రభుత్వ డ్రైవర్ల సంఘం భవనంలో సోమవారం జరిగింది. సమావేశంలో విశ్రాంత డ్రైవర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా పశ్చిమ గోదావరి జిల్లాకు చెందిన యండమరి నాగరాజును ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. ప్రభుత్వ డ్రైవర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సంసాని శ్రీనివాసరావు మాట్లాడుతూ అన్ని జిల్లాల్లో ఉన్న ప్రభుత్వ డ్రైవర్ల సంఘం భవనాల్లో ఒక గదిని విశ్రాంత డ్రైవర్లకు కేటాయించనున్నట్లు తెలిపారు. ఇలా కేటాయించిన రూంకు కె.ఎం.రసూల్ పేరు పెట్టాలని సమావేశంలో తీర్మానించామన్నారు. ప్రభుత్వ డ్రైవర్ల సంఘం గుంటూరు జిల్లా అధ్యక్షుడు వేంపాటి పాపారావు మాట్లాడుతూ విశ్రాంత డ్రైవర్లకు గుంటూరులో ఒక రూమును కేటాయిస్తామని స్పష్టం చేశారు. అలాగే గుంటూరు జిల్లా విశ్రాంత డ్రైవర్ల సంఘం అధ్యక్షుడిగా మొగిలి గురవయ్య, కార్యదర్శిగా కొల్లి కోటిరెడ్డి, గౌరవాధ్యక్షులుగా కఠారి హనుమంతురావు, సలహాదారుగా ఎం.కోటేశ్వర నాయక్‌లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. త్వరలో అన్ని జిల్లాల విశ్రాంత డ్రైవర్ల సంఘాల ఎన్నికలు చేపడతామని నాగరాజు తెలిపారు. సమావేశంలో వివిధ జిల్లాల ప్రభుత్వ డ్రైవర్ల సంఘం నాయకులు జె.మునిబాగు, జీహెచ్ నాగులు, సాల్మన్‌రాజు, మనోహర్, నాగిరెడ్డి, సత్యనారాయణ, భాస్కర్, అప్పలనాయుడు, రామారావు, వెంకటేశ్వరరావు, లింగేశ్వరరావు, పలువురు రాష్ట్ర విశ్రాంత డ్రైవర్లు పాల్గొన్నారు.

యుద్ధాల్లోనూ గెలుపు, ఓటములు



నగరంపాలెం: యుద్ధాల్లోనూ గెలుపు ఓటములు ఉంటాయని పద్మశ్రీ పురస్కార గ్రహీత, మహా సహస్రావధాని డాక్టర్ గరికపాటి నరసింహారావు అన్నారు. పట్టాభిపురం శ్రీరమా సత్యనారాయణ స్వామి(48) బ్రహ్మోత్సవాలు సోమవారంతో ముగిశాయి. భారత యుద్ధంలో భగవంతుని పాత్రపై గరికపాటి ప్రసంగించారు. ఎన్నికలు వలె యుద్ధాలు ఉంటాయని, గొప్ప వీరుడు చిన్నవాడి చేతుల్లో ఓడిపోతాడని పేర్కొన్నారు. భారతం మన నిత్య జీవితం అన్నారు. రామయణం ఆదర్శ జీవితమని, భాగవతం దివ్య జీవితమని అన్నారు. ఈ మూడింటిని చదువుకుని, తర్వాత జపం చేసుకుంటే చాలునని చెప్పారు. పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు భారీగా తరలివచ్చారు.

రెండు వారాలు గడువు కోరిన ఆర్జీవీ తరఫు న్యాయవాది

నగరంపాలెం: ప్రముఖ దర్శకుడు రాంగోపాల్ వర్మ (ఆర్జీవీ)కి రెండు వారాలు గడువు కావాలని ఆయన తరఫు న్యాయవాది సోమవారం గుంటూరు సీఐడీ ప్రాంతీయ కార్యాలయంలో తెలియజేశారు. 2019లో దర్శకుడు ఆర్జీవీ కమ్మ రాజ్యంలో కడప రెడ్లు అనే చిత్రాన్ని తీశారని, తద్వారా మనోభావాలు భంగం కలిగినట్లు నవంబర్ 29న సీఐడీ కార్యాలయంలో తెలుగు యువత రాష్ట్ర అధికార ప్రతినిధి బండారు వంశీకృష్ణ ఫిర్యాదు చేశారు. ఈ మేరకు గుంటూరు సీఐడీ ప్రాంతీయ కార్యాలయం నుంచి సీఐ తిరుమలరావు ఈనెల ఏడో తేదిన ఒంగోలు వెళ్లారు. ఒంగోలు రూరల్ పీఎస్‌కు విచ్చేసిన దర్శకుడు ఆర్జీవీకి ఈనెల 10వ తేదీన గుంటూరు సీఐడీ కార్యాలయంలో విచారణకు హాజరుకావాలని నోటీసులు జారీ చేసిన విషయం విధితమే. అయితే దర్శకుడు రెండు వారాలు తరువాత విచారణకు హాజరవుతారని లేఖలో న్యాయవాది పేర్కొన్నారు.

వేర్వేరు ప్రమాదాలలో ఇద్దరు మృతి

కాకుమాను: రెండు వేర్వేరు రోడ్డు ప్రమాదాలలో ఇద్దరు మృతి చెందిన సంఘటన మండలంలోని గ్రామాలలో ఆదివారం రాత్రి చోటుచేసుకుంది. ఎస్‌ఐ ఏక్‌నాథ్ తెలిపిన వివరాల ప్రకారం.. కాకుమాను చెందిన పినపాల చలం(59) ద్విచక్ర వాహనంపై పెదనందిపాడు నుంచి కాకుమాను వస్తుండంగా కాకుమాను సమీపంలో నిలిపి ఉన్న ట్రాక్టర్‌ను ఢీకొట్టడంతో తీవ్ర గాయాలపాలయ్యాడు. కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం గుంటూరు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు.

■ కొండపాటూరుకు చెందిన ఆటో డ్రైవర్ బొలిమేర లెనిన్(24) ప్రయాణికులను కాకుమానులో దించి తిరిగి కొండపాటూరు వస్తుండగా సుమారు 11 గంటల సమయంలో మంచు కారణంగా రోడ్డు కనిపించకపోవడంతో ఆటో అదుపుతప్పి బోల్తాపడి మృతి చెంది చెందినట్లు ఎస్‌ఐ తెలిపారు. ఇద్దరి మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం గుంటూరు, బాపట్ల వైద్యశాలలకు తరలించి కుటుంబ సభ్యుల ఫిర్యాదుల మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ ఏక్‌నాథ్ తెలిపారు.

బంగారు పతకం సాధించిన అనూరాధకు సన్మానం

కర్లపాలెం: ఏషియన్ గేమ్స్‌లో షూటింగ్ బాల్ పోటీలలో బంగారు పతకం సాధించి దేశానికి, రాష్ట్రానికి పిట్టు అనూరాధరెడ్డి మంచి పేరు తీసుకురావడం అభినందనీయమని ఏట్రవారిపాలెం సర్పంచ్ చీరాల వెంకటలక్ష్మి తెలిపారు. నేపాల్‌లో ఫిబ్రవరి 2,3వ తేదీల్లో జరిగిన ఏషియన్ గేమ్స్‌లో ఇండియా జట్టులో పిట్టు అనూరాధరెడ్డి ఆడి బంగారు పతకం సాధించింది. ఆమెను సోమవారం సర్పంచ్ చీరాల వెంకటలక్ష్మి, శ్రీనివాసరెడ్డి దంపతులు శాలువా కప్పి, పూలమాలతో సన్మానించారు.

అక్రమంగా విద్యుత్ వాడితే కఠిన చర్యలు



విద్యుత్ వినియోగదారుల సమావేశంలో మాట్లాడుతున్న ఎస్ఈ ఆంజనేయులు

కాకుమాను: నిబంధనలకు విరుద్ధంగా విద్యుత్‌ను వినియోగిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని బాపట్ల జిల్లా విద్యుత్ శాఖ ఎస్ఈ జి.ఆంజనేయులు అన్నారు. పెదనందిపాడు మండలంలోని పలు గ్రామాలలో సోమవారం విద్యుత్ శాఖ అధికారులు ఆకస్మిక దాడులు నిర్వహించారు. ఆంజనేయులు మాట్లాడుతూ గృహావసరాలకు, వాణిజ్య సముదాయాలకు విద్యుత్ కనెక్షన్‌లు పొందిన వారు నిబంధనలకు అనుగుణంగా వినియోగించాలన్నారు. పబ్లిక్ పోల్స్‌పై కనెక్షన్‌లను ఏర్పాటు చేసుకుని, విద్యుత్ మీటర్లు తిరగకుండా చేస్తే అటువంటిని గుర్తించి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. అధికారులు 35 బృందాలుగా ఏర్పాడి 1176 ఇంటి సర్వీసులను, 5 వాణిజ్య మీటర్లను తనిఖీ చేసి 405 సర్వీసు మీటర్లు అనుమతించిన లోడు కంటే అదనంగా విద్యుత్‌ను ఉపయోగిస్తున్నట్లు గుర్తించి రూ.15.72 లక్షల అపరాధ రుసుము విధించారు. దాడుల్లో విజిలెన్స్ శాఖ అధికారి మల్లికార్జున్, పొన్నూరు ఏడీఈ శ్యామ్ కుమార్, ఏఈ బి.వీరాంజనేయులు పాల్గొన్నారు.

చోరీ కేసులో నిందితుడి అరెస్టు



కేసు వివరాలను వెల్లడిస్తున్న డీఎస్పీ నాగేశ్వరరావు

నరసరావుపేటటౌన్ : చోరీ కేసులో నిందితుడిని అరెస్ట్ చేసి అతని వద్ద నుంచి బంగారు ఆభరణాలు, నగదు స్వాధీనం చేసుకున్నట్లు డీఎస్పీ కె.నాగేశ్వరరావు తెలిపారు. సోమవారం డీఎస్పీ కార్యాలయంలో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో కేసు వివరాలను ఆయన వెల్లడించారు. డీఎస్పీ కథనం ప్రకారం.. రొంపిచర్ల మండలం బుచ్చిబాపన్నపాలెం గ్రామానికి చెందిన చల్లా అంజమ్మ ఈ నెల 7న మిరపకాయల పనికి వెళ్లి సాయంత్రం ఇంటికి వచ్చింది. తలుపు తాళాలు తీసి బీరువా పగులగొట్టి ఉండడంతో ఆదుర్దాగా లోపలకి వెళ్లింది. బీరువాలో ఉండాల్సిన బంగారు ఆభరణాలు, రూ.30 వేల నగదు కనిపించలేదు. దొంగతనం జరిగిందని గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసి ఎస్‌ఐ మణికృష్ణ దర్యాప్తు ప్రారంభించారు. అదే గ్రామానికి చెందిన పల్లెపు విష్ణు 10వ తేదీ ద్విచక్రవాహనంపై వస్తూ తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులను చూసి పారిపోయేందుకు యత్నించాడు. అతన్ని అదుపులోకి తీసుకొని విచారించగా చోరీ తానే చేసినట్లు అంగీకరించాడు. దీంతో చోరీ చేసిన సొత్తును అతని వద్ద నుంచి స్వాధీనం చేసుకున్నామని డీఎస్పీ వెల్లడించారు. పేకాట, వ్యసనాలకు బానిసై నిందితుడు చోరీలకు పాల్పడినట్లు విచారణలో తేలిందని వివరించారు.

వృద్ధురాలి హత్య కేసులో మనవడి అరెస్టు

రేపల్లె రూరల్: వృద్ధురాలి హత్య కేసులో మనవడిని అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరిచినట్లు పట్టణ సీఐ మల్లికార్జునరావు తెలిపారు. స్థానిక సర్కిల్ కార్యాలయంలో సోమవారం ఆయన వివరాలను వెల్లడించారు. పట్టణంలోని 3వ వార్డు మున్నుబువారిపాలేనికి చెందిన పసుపులేటి సరస్వతిని ఆదివారం అర్ధరాత్రి ఆమె మనవడు (మైనరు) మద్యం మత్తులో ఇంటికి వెళ్లి గొడవ పడ్డాడు. కూరగాయలు కోసుకునే కత్తితో పీక కోసి హత్య మార్చాడు. అనంతరం ఇంట్లోని రూ.60వేలను ఎత్తుకు పోయాడు. మృతురాలి చిన్న కుమార్తె ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేశామని, మృతురాలి భర్త వెంకటేశ్వరరావు మొదటి భార్య కుమారుడి కొడుకు ఈ హత్యకు పాల్పడ్డాడని తేలిందని చెప్పారు. బాలుడిని అరెస్ట్ చేసి, హత్యకు ఉపయోగించిన చాకు, అపహరించిన నగదును స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. జిల్లా ఎస్పీ, బాపట్ల డీఎస్పీ సూచనలతో నూతన టెక్నాలజీని వినియోగించి 24 గంటల్లో కేసును ఛేదించామని చెప్పారు.

ఐఏ, ఏడీ సౌత్‌జోన్ క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం



క్రికెటర్లను పరిచయం చేసుకుంటున్న నిర్వాహకులు



కర్నాటక - తమిళనాడు జట్ల మధ్య జరుగుతున్న మ్యాచ్

- తొలిరోజు ఆంధ్ర, తెలంగాణ ఉమ్మడి జట్టుపై కేరళ విజయం
- కర్నాటకపై తమిళనాడు జట్టు జయకేతనం

మంగళగిరి: నగర పరిధిలోని నవులూరు అమరావతి టౌన్‌షిప్‌లో గల ఏసీఏ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంలో ప్రతిష్టాత్మక ఐఏ, ఏడీ సౌత్ జోన్–2025 క్రికెట్ టోర్నమెంట్ మ్యాచ్‌లు సోమవారం ప్రారంభమయ్యాయి. తొలుత ఆంధ్ర, తెలంగాణ ఉమ్మడి జట్టు – కేరళ రాష్ట్రాల మధ్య మ్యాచ్ జరగగా కేరళ జట్టు విజయం సాధించింది. టాస్ గెలిచిన కేరళ జట్టు బౌలింగ్‌ను ఎంచుకోగా బ్యాటింగ్ చేపట్టిన ఆంధ్ర–తెలంగాణ నిర్ణీత 20 ఓవర్లలో ఏడు వికెట్లు నష్టానికి 96 పరుగులు చేసింది. 97 పరుగుల లక్ష్యంతో బ్యాటింగ్ చేపట్టిన కేరళ జట్టు 18.3 ఓవర్లలో నాలుగు వికెట్లు నష్టపోయి 100 పరుగులు సాధించి జయకేతనం ఎగురవేసింది. ఆంధ్ర–తెలంగాణకు చెందిన బ్యాట్స్‌మెన్ రవితేజ 40 పరుగులు, ఎస్ కొఠారి 26 పరుగులు చేయగా కేరళ జట్టు బౌలర్ అంకిత మిశ్రా 4 ఓవర్లలో 17 పరుగులు ఇచ్చి 4 వికెట్లు తీసి రాణించాడు. రెండవ మ్యాచ్‌లో తమిళనాడు–కర్నాటక జట్లు తలపడగా తమిళనాడు కర్నాటకపై మూడు వికెట్లు తేడాతో విజయం సాధించింది. టాస్ గెలిచిన తమిళనాడు జట్టు బౌలింగ్ ఎంచుకోగా బ్యాటింగ్ చేసిన కర్నాటక జట్టు 20 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి 169 పరుగులు చేసింది. జట్టు బ్యాట్స్‌మెన్ హెచ్.అర్జున్ 47 పరుగులు, శరత్ బీఆర్ 40 పరుగులు జె సుజిత్ 31 పరుగులు చేసి రాణించారు. 170 పరుగుల విజయ లక్ష్యంతో బ్యాటింగ్ చేపట్టిన తమిళనాడు జట్టు చివరి ఓవర్ చివర బంతి వరకు ఉత్కంఠభరితంగా జరిగిన పోరులో విజయం సాధించింది. తమిళనాడు జట్టులో భరద్వాజ్ 83 పరుగులు, విఘ్నేష్ 27 పరుగులతో రాణించారు. నిర్వాహకులు భాస్కర్ కల్లూరి, కిషోర్ రెడ్డి, రాకేష్ నాయక్, ఎస్.నిఖిల్‌లు జెండా ఊపి టోర్నమెంట్‌ను ప్రారంభించారు. అదేవిధంగా జాతీయ, అంతర్జాతీయ టోర్నమెంట్‌లలో అత్యుతమ ప్రతిభ కనపరచిన క్రికెటర్ నీలం మణిశ్రావణిని నిర్వాహకులు అభినందించి బహుమతి ప్రదానం చేశారు.

వరుస సంఘటనలు కక్ష సాధింపు చర్యలే

- మాజీ సీఎం వైఎస్ జగన్‌కు తగిన భద్రత కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే
- మొక్కుబడిగా సీసీ కెమెరాల బిగింపు
- జరిగిన ఘటనలపై పూర్తిస్థాయిలో విచారణ జరపాలి
- వైఎస్సార్ సీపీ రాష్ట్ర గ్రీవెన్స్ సెల్ అధ్యక్షుడు అంకిరెడ్డి రామ నారాయణ మూర్తి



మాట్లాడుతున్న అంకిరెడ్డి రామ నారాయణమూర్తి

తాడేపల్లిరూరల్: వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ప్రభుత్వం తగిన భద్రత కల్పించాలని పార్టీ రాష్ట్ర గ్రీవెన్స్ సెల్ అధ్యక్షుడు అంకిరెడ్డి రామ నారాయణమూర్తి అన్నారు. సోమవారం తాడేపల్లి పోలీస్‌స్టేషన్‌కు పోలీసులు అడిగిన సమాచారాన్ని అందించేందుకు ఆయన విచ్చేశారు. రామ నారాయణమూర్తి మాట్లాడుతూ మాజీ సీఎం వైఎస్ జగన్ నివాసం వద్ద తూతూ మంత్రంగా సీసీ కెమెరాలు అమర్చడం వల్ల ఎటువంటి ఉపయోగం లేదని, జరుగుతున్న వరుస సంఘటనలపై ప్రభుత్వం చర్యలు చేపట్టి వెంటనే భద్రతను పెంచాలన్నారు. కక్షసాధింపు చర్యల్లో భాగంగా కూటమి ప్రభుత్వం రాగానే మాజీ ముఖ్యమంత్రి క్యాంపు కార్యాలయం వద్ద ఉన్న సీసీ కెమెరాలను తొలగించడంతో పాటు, చెక్ పోస్టులను, ఇతర భద్రతా ఏర్పాట్లను తొలగించారన్నారు. ఆ తరువాత బీజేపీ కార్యకర్తలు క్యాంపు కార్యాలయంపై దాడి చేయడం, అనంతరం మంత్రి నారా లోకేష్ జన్మదినోత్సవం సందర్భంగా టీడీపీ కార్యకర్తలు వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యాలయం, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నివాసం వద్దకు వచ్చి రెచ్చగొట్టే విధంగా నినాదాలు చేస్తూ, కార్ల డోర్లు కొడుతూ, వాహనాల సైలెన్సర్లు ఊడదీసి గోల చేయడం, ఈనెల 5వ తేదీ మధ్యాహ్నం వైఎస్సార్ సీపీ కార్యాలయం ఎదురుగా ఉన్న పార్కులో నిప్పుపెట్టడం, అనంతరం అదేరోజు రాత్రి 7.30 సమయంలో మరోసారి పార్కులో నిప్పు పెట్టడంతో భారీగా మంటలు చెలరేగడం తదితర ఘటనలపై విచారణ చేయాలని తాడేపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశామన్నారు. వరుస ఘటనల తరువాత వైఎస్సార్ సీపీ కార్యాలయం నుంచి ఫిర్యాదు చేస్తే పోలీసులు ఏదో మొక్కుబడిగా కార్యాలయం వద్ద, భరతమాత సెంటర్ వద్ద, కార్యాలయానికి దక్షిణం వైపు కెమెరాలు బిగించారని, వాటివల్ల ఎటువంటి ఉపయోగం లేదని, తీసివేసిన చెక్‌పోస్టులను వెంటనే ఏర్పాటు చేయాలన్నారు. చెక్‌పోస్టులు తీసివేయడం వల్ల అక్కడ మందుబాబులు, ఇతర అసాంఘిక శక్తులు చేరి బైక్ రేసింగ్‌లు, కార్ రేసింగ్‌లు నిర్వహిస్తున్నారని, వెంటనే ప్రభుత్వం మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి భద్రత పెంచాలని ఆయన డిమాండ్ చేశారు.

స్టేట్ కరాటే చాంపియన్‌షిప్‌లో విద్యార్థుల ప్రతిభ

సత్తెనపల్లి: రాష్ట్ర స్థాయి కరాటే చాంపియన్‌షిప్ పోటీల్లో సత్తెనపల్లి విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. కృష్ణా జిల్లా విజయవాడలోని చెన్నుపాటి రామకోటయ్య ఇండోర్ స్టేడియంలో స్పోర్ట్ కరాటేడు, ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో స్టేట్ కరాటే ఛాంపియన్‌షిప్ ఈ నెల 9న జరిగింది. ఈ టోర్నీలో సత్తెనపల్లికి చెందిన షికోకాయ్ షిటోరియో కరాటే స్కూలు విద్యార్థులు 11 మంది విజయఢంకా మోగించారు. కటా విభాగంలో 11 మంది ప్రతిభ చూపి గెలుపొందారు. వీరిలో ఎనిమిది మంది విద్యార్థులు జూన్‌లో డిల్లీలో జరిగే జాతీయస్థాయి కరాటే పోటీలకు ఎంపికయ్యారు. వ్యక్తిగత బాలికల కటా విభాగంలో 13 ఏళ్ల కేటగిరిలో ఎం.దేవిశ్రీ (గోల్డ్‌మెడల్), 12 ఏళ్ల కేటగిరిలో డి.బాలవైష్ణవి (గోల్డ్‌మెడల్), 10 ఏళ్ల కేటగిరిలో బి.అక్షయారెడ్డి (గోల్డ్‌మెడల్), 14 ఏళ్ల కేటగిరిలో టి.నిఖిత (సిల్వర్‌మెడల్) సాధించారు. వ్యక్తిగత బాలుర కటా విభాగంలో 12 ఏళ్ల కేటగిరిలో బి.సత్యనారాయణ(గోల్డ్‌మెడల్), బి.టిష్యంత్(గోల్డ్‌మెడల్), ఎమ్‌వీ బాలాజీ (గోల్డ్‌మెడల్), 11 ఏళ్ల కేటగిరిలో ఎస్.ఎం.ఎస్.దినేష్ (గోల్డ్‌మెడల్), ఎల్.కిదీట్(గోల్డ్‌మెడల్), 12 ఏళ్ల కేటగిరిలో ఎల్.గేష్ను అషిత్ (సిల్వర్‌మెడల్), 11 ఏళ్ల కేటగిరిలో, కె.తేజ్‌ప్రకాష్(సిల్వర్‌మెడల్) పతకాలు కై వసం చేసుకున్నారు. ప్రతిభ చూపిన విద్యార్థులను స్టేట్‌వైస్ ప్రసిడెంట్ నల్లూరు మోహన్‌రావు, షిహాన్ అనుముల రాంబాబు, అనుముల రామయ్యలు సోమ వారం ప్రత్యేకంగా అభినందించారు.